కిరణ్ టైప్ ఇన్స్టిట్యూట్

శ్రీ రామ రక్షా స్తోత్రమ్

- భావార్థముతో -



సేకరణ: కిరణ్ టైప్ ఇనిస్టిట్యూట్, 41-1/8-13A.,
గౌతమీనగర్,3వ లైను, కృష్ణలంక, విజయవాడ-520 013.
https://madhirafamily.wordpress.com/

శ్రీ రామ రక్షా స్తోత్రమ్ - భావార్థముతో -

శ్రీ రామ రక్షా స్తోత్రం అత్యంత ప్రతిభావంతమైనది. ఈ స్తోత్రం శారీరక, మానసిక, రుగ్మతలను పూర్తిగా తొలగిస్తుంది. శత్రుభయం అశాంతి, నిరాశ, నిస్పృహ, దుఃఖం, మొదలైన పరిస్థితులలో ఈ స్తోత్రాన్ని పఠిస్తే, అన్ని బాధలు దూరమౌతాయి. అయితే కావలసినదల్లా అచంచలమైన, దృఢమైన విశ్వాసం, భక్తి. ధనబలం, విద్యాబలం, బుద్ధిబలం ప్రసాదించే ఈ స్తోత్ర రాజాన్ని నిరంతరం పఠించి తరించుదాం.

ఓం అస్య శ్రీ రామరక్షా స్తోత్ర మంత్రస్య బుధకౌశిక ఋషిః
శ్రీ సీతారామ చంద్రోదేవతా అనుష్టుప్ చందః॥
సీతా శక్తిః। శ్రీమాన్(శ్రీమద్) హనుమాన్ కీలకం।
శ్రీరామచంద్ర ప్రీత్యర్థే రామరక్షా స్తోత్ర జపే వినియోగః॥

శ్రీరామ రక్షా స్తోత్రం మంత్రమునకు బుధకౌశికుడు - ఋషి; సీతాసమేత శ్రీరామచంద్రస్వామి - అధిదేవత; సీతామాత - శక్తి, హనుమంతుడు - కీలకము. ఈ స్తోత్రం అనుష్టుప్పు ఛందస్సులో వ్రాయబడినది. శ్రీ రామరక్షా స్తోత్రమును శ్రీరామచంద్రుని ప్రీతి (అనుగ్రహం) కొరకు వినియోగించెదరు.

(ఏ మంత్రమునైనను తెలిసికొనుటకు ముందుగా దానిని దర్శించిన ఋషి, ఆ మంత్ర అధిదేవత, ఛందస్సు, శక్తి, కీలకము, దాని ప్రయోజనమును వివరించుట ఆర్ష సాంప్రదాయము)

శ్రీ రామ రక్షా స్తోత్రాన్ని ఉపదేశించిన వారు శ్రీ బుధ కౌశిక ఋషి. ఈ స్తోత్రానికి శక్తి సీతాదేవి. కీలకమైన వ్యక్తి శ్రీ ఆంజనేయుడు. శ్రీ రామచంద్రుని ప్రీతి కొరకు ఈ స్తోత్రాన్ని వినియోగించాలి.

"శ్రీరామరక్షాస్తోత్రము" అను ఈ మంత్రమునకు బుధకౌశికుడు అను ఋషి మంత్రద్రష్ట. శ్రీ సీతాసమేతుడగు శ్రీ రామచంద్రుడు దేవత. అనుష్టుప్ ఛందము. (మంత్ర) శక్తి సీతాదేవి, కీలకము శ్రీ హనుమంతుడు, శ్రీ రామచంద్రుని అనుగ్రహము పొందుట కొరకు ఈ రామరక్షాస్తోత్ర మంత్రము జపించుటకు వినియోగింపబడుచున్నది.

ధ్యానమ్:

ధ్యాయేదాజానుబాహుం ధృత శర ధనుషం
బద్ధ పద్మాసనస్థమ్।
పీతం వాసోవసానం నవకమల దళ స్పర్థి నేత్రం
ప్రసన్నమ్॥
వామాంకారూఢ సీతా ముఖ కమల మిలల్లోచనం
నీరదాభమ్।
నానాలంకార దీప్తం దధతమురు జటామండలం
రామచంద్రమ్॥

ఆజానుబాహుడు, ధనుర్బాణాలను ధరించినవాడు, పసుపు పచ్చని వస్త్రాలను ధరించి పద్మాసనస్థుడై కూర్చుని యున్నవాడు, కలువ రేకులకన్న మిన్న అయిన కనుగవ కలవాడు, నీల మేఘ శ్యాముడు, వివిధ అలంకారాలతో ప్రకాశించుచున్న జటామండలం గలవాడు, ఎడమవైపు ఒడిలో కూర్చుని ఉన్న సీతాదేవి ముఖ కమలాన్ని చూస్తు ప్రసన్నమైన వదనం కలవాడు అయిన శ్రీరామచంద్రుని ధ్యానించవలెను.

చేతిలో ధనుస్సు, బాణాలను ధరించినవాడు, కమలాలవంటి కన్నులు కలవాడు, వామ భాగంలో సీతాదేవితో కలిసి ఉన్నవాడు, ఆజానుబాహుడు,

నీలవర్ణుడు, అనేక ఆభరణాలతో అలంకరించబడిన వాడు, జటాజూటధారి అయిన శ్రీ రామచంద్రుని ధ్యానిస్తున్నాను.

ఆజానుబాహుడు, ధనుర్బాణములు ధరించినవాడు, పద్మాసనమున కూర్చుండి యున్నవాడు, పచ్చని బంగారు వస్త్రములు దాల్చినవాడు, (సూర్యకిరణముల చేత) అప్పుడే వికసించిన పద్మపత్రములవంటి అందమైన కన్నులు కలవాడు, ఎడమ భాగమున కూర్చునియున్న సీతాదేవి ముఖకమలమును చూచువాడు, మేఘశ్యాముడు, వివిధములగు అలంకారములతో విరాజిల్లెడువాడు, విపుల జటాజూటధారి, ప్రసన్నవదనుడు శ్రీరామచంద్రుడు, ఇట్టి శ్రీరామచంద్రుని స్వరూపమును చక్కగా ధ్యానించవలెను.

స్తోత్రమ్:

01. చరితం రఘునాథస్య శతకోటి ప్రవిస్తరమ్।
ఏకైక మక్షరం పుంసాం మహాపాతక నాశనమ్॥

వందకోట్ల శ్లోకాలతో విస్తరించిన శ్రీరాముని చరిత్రలోని ప్రతి అక్షరము మహాపాపములను సైతం పోగొట్టగల శక్తిని కలిగి ఉన్నది.

శతకోటి ప్రవిస్తరమైన శ్రీ రఘునాథుని చిత్రలోని ప్రతి అక్షరం కూడా మానవుని యొక్క మహా పాతకాలను హరిస్తుంది.

శ్రీరఘునాథుని దివ్యచరిత్రము నూరుకోట్ల శ్లోకములతో అతి విస్తారమైనది. అందులోని ఒక్కొక్క అక్షరము మానవుని మహాపాపములను సైతము నశింపజేయును.

02. ధ్యాత్వా నీలోత్పల శ్యామం రామం రాజీవలోచనమ్।
జానకీ లక్ష్మణోపేతం జటాముకుట మండితమ్॥

నల్లకలువల వంటి శరీరవర్ణం కలవాడు, కమల నేత్రుడు, జటామండలమే కిరీటముగా ధరించినవాడు, సీతాలక్ష్మణులతో కూడి ఉన్నవాడైన శ్రీరాముని (హృదయమున నిలిపి) ధ్యానించవలెను.

03. సాసితూణ ధనుర్బాణ పాణిం నక్తం చరాంతకమ్।
స్వ లీలయా జగత్రాతుం మావిర్భూత మజం విభుమ్॥

ఖడ్గము, ధనుస్సు బాణ తూణీరములు ధరించి రాక్షసులను సంహరించువాడు, జననములేని వాడు, లోకములను రక్షించుట కోసమై లీలామానుష విగ్రహుడై అవతరించు భగవానుని ధ్యానించవలెను.

04. రామరక్షాం పఠేత్ప్రాజ్ఞః పాపఘ్నీం సర్వకామదామ్।
శిరో మే రాఘవః పాతు ఫాలం దశరథాత్మజః॥

సమస్త పాపములను నాశనం చేయునది, కోరిన కోర్కెలు తీర్చునది అయిన రామరక్షా స్తోత్రమును జ్ఞాని అయినవాడు పఠించవలెను. రఘువంశ సంజాతుడైన ఆ రామచంద్ర ప్రభువు నా శిరస్సును రక్షించుగాక. నా నుదిటిని దశరథ నందనుడైన శ్రీరాముడు రక్షించుగాక.

02,03,04. నీలమేఘశ్యాముడు, కమలములవంటి కన్నులు కలవాడు,సర్వ ఆయుధధారి, రాక్షస సంహారీ, జగత్తును రక్షించడానికి అవతరించినవాడు, సర్వము వ్యాపించినవాడు, సీతా లక్ష్మణ సమేతుడైన శ్రీ రామచంద్రుడు నా శిరస్సును, లలాట ప్రదేశాన్ని రక్షించుగాక.

02,03,04. నల్లకలువ వంటి శ్యామల వర్ణుని, కమలముల వంటి కన్నులు కలవానిని, సీతాలక్ష్మణ సమేతుని, జటామకుటముతో శోభించువానిని, చేతులయందు ఖడ్గము, తూణీరము, ధనుర్బాణములను దాల్చిన వానిని, రాక్షస సంహారము చేసినవానిని, జన్మలేని వాడైనను ఈ లోకమును రక్షించుటకై లీలామానుష రూపముతో అవతరించినవానిని, సర్వవ్యాపకుడైన శ్రీరాముని మనమున ధ్యానించి, ఆ తర్వాత బుద్ధిమంతుడైనవాడు, సర్వ పాపములను నశింపచేసి, సకల అభీష్టములను ప్రసాదించే ఈ “రామరక్షాస్తోత్రము” ను పఠింపవలెను. నా శిరస్సును రాఘవుడు కాపాడుగాక. నుదురును దశరథుని కుమారుడగు దాశరథి రక్షించుగాక.

05. కౌసల్యేయో దృశౌపాతు విశ్వామిత్రః ప్రియః శృతీ।
ఘ్రాణం పాతు మఖత్రాతా ముఖం సౌమిత్రి వత్సలః॥

కౌసల్యా సుతుడు నా కళ్ళను - విశ్వామిత్రుని ప్రియ శిష్యుడు నా చెవులను - సుగంధ రూపములను వెదజల్లు యజ్ఞములను రక్షించు వాడు నా ముక్కును - లక్ష్మణుని యందు వాత్సల్యము కలవాడు నా నోటిని రక్షించుగాక.

కౌసల్యానందనుడు నా నేత్రాలను, విశ్వామిత్రునికి అతి ఇష్టుడు నా కర్ణములను, యజ్ఞములను రక్షించినవాడు నా జ్ఞానేంద్రియములను సౌమిత్రీ వత్సలుడు నా ముఖమును రక్షించుగాక.

నా కన్నులను కౌసల్యానందనుడగు రాముడు కాచుగాక. చెవులను విశ్వామిత్ర ప్రియుడు బ్రోచుగాక. ముక్కును (విశ్వామిత్రుని) యాగరక్షకుడు సంరక్షించుగాక, నా ముఖమును సౌమిత్రీ వత్సలుడు కాపాడుగాక.

06. జిహ్వాం విద్యా నిధిః పాతు కంఠం భరత వందితః।
స్కంధౌ దివ్యాయుధః పాతు భుజౌ భగ్నే శకార్ముకః॥

సమస్త విద్యలకు నిధియైన రాముడు నా నాలుకను - భరతునిచే నమస్కరింప బడువాడు నా కంఠమును - భుజములందు దివ్యాయుధములను ధరించువాడు నా మూపును, తన భుజబలముతో శివ ధనుస్సును విరిచినవాడు నా భుజములను కాపాడుగాక.

విద్యానిధి అయినవాడు నా జిహ్మను, భరతునిచే పూజింపబడిన వాడు నా కంఠమును, దివ్యాయుధుడు నా స్కంధములను, శివుని విల్లు విరచినవాడు నా భుజములను రక్షించుగాక.

నా నాలుకను విద్యానిధి, కంఠమును భరత వందితుడు కాచుగాక. స్కంధములను దివ్యాయుధధారి, భుజములను శివధనుస్సును విరిచిన స్వామి కాపాడుగాక.

కిరణ్ టైప్ ఇన్స్టిట్యూట్

07. కరౌ సీతాపతిః పాతు హృదయం జామదగ్న్యజిత్।
మధ్యం పాతు ఖరధ్వంసీ నాభిం జాంబవదాశ్రయః॥

స్వయంవరమున సీతాపాణి గ్రహణం చేసిన శ్రీరామ చంద్రుడు నా చేతులను - పరశురాముని జయించిన ప్రభువు నా హృదయాన్ని - ఖర ధూషణులను సంహరించిన రాముడు నా నడుమును - జాంబవంతుని అనుగ్రహించిన శ్రీ రాముడు నా నాభిని కాపాడుగాక.

సీతామనోహరుడు నా హస్తాలను, పరశురాముని జయించినవాడు నా హృదయాన్ని, రాక్షసాంతకుడు నా మధ్య భాగాన్ని, జాంబవంతుడు ఆశ్రయించిన వాడు నా నాభిని రక్షించుగాక.

నా రెండు చేతులను సీతాపతి కాపాడుగాక. నా హృదయమును పరశురాముని జయించిన శ్రీరాముడు రక్షించుగాక. నడుము భాగమును ఖరుడను రక్కసుని చంపినవాడు కాచుగాక. అట్లే నాభిని జాంబవంతునకు ఆశ్రయమిచ్చిన ప్రభువు కాపాడుగాక.

08. సుగ్రీవేశః కటీ పాతు సక్థినీ హనుమత్-ప్రభుః।
ఊరూ రఘూత్తమః పాతు రక్షఃకుల వినాశకృత్॥

సుగ్రీవుని ప్రభువు నాభి క్రిందిభాగమును - హనుమంతుని ప్రభువు నా తొడ, ఎముకలను - రాక్షసులను సంహరించిన రఘురాముడు నా ఊరువులను రక్షించుగాక.

సుగ్రీవుని ప్రభువు నా కటి భాగాన్ని, ఊరువులను హనుమత్ ప్రభువు, రఘుకులశ్రేష్ఠుడు నా జఘన భాగాన్ని రక్షించుగాక.

కటి (నడుము) భాగమును సుగ్రీవుని స్వామి, తొడలపై భాగమును హనుమంతుని ఏలిన ప్రభువగు శ్రీరాముడు రక్షించుగాక. తొడల భాగమును రాక్షస వంశ వినాశకుడగు రఘుశ్రేష్ఠుడు కాపాడుగాక.

Kiron Type Institute

09. జానునీ సేతు కృత్పాతు జంఘే దశముఖాంతకః।
పాదౌ విభీషణ శ్రీదః పాతు రామోఽఖిలం వపుః॥

సముద్రానికి వారధి నిర్మించినవాడు నా మోకాళ్ళను - రావణుని సంహరించినవాడు నా పిక్కలను - విభీషణునికి రాజ్య సంపదను ప్రసాదించిన ప్రభువు నా పాదములను రక్షించుగాక. - శ్రీరామచంద్ర ప్రభువు నా దేహమంతటినీ కాపాడుగాక.

సేతువును నిర్మించినవాడు నా మోకాళ్ళను, దశముఖుని సంహరించినవాడు నా మణికట్టును, విభీషణునికి అభయప్రదాత నా చరణాలను, శరీరం మొత్తాన్ని రక్షించుగాక.

నా మోకాళ్ళను సేతువును నిర్మించిన శ్రీరాముడు, పిక్కలను దశముఖుడగు రావణాసురుని సంహరించినవాడు రక్షించుగాక. పాదములను విభీషణునకు రాజ్యలక్ష్మిని ప్రసాదించినవాడు కాచుగాక. సకల దేహమును శ్రీరాముడు కాపాడుగాక.

10. ఏతాం రామబలోపేతాం రక్షాం యః సుకృతీ పఠేత్।
స చిరాయుః సుఖీ పుత్రీ విజయీ వినయీ భవేత్॥

శ్రీరామ బల సమన్వితమైన ఈ రామ రక్షా స్తోత్రమును పఠించిన పుణ్యాత్ముడు దీర్ఘాయుష్మంతుడై పుత్ర పౌత్రులతో విజయవంతుడై వినయశీలుడై సమస్త సుఖములను పొందును.

ఎవరైతే రామబలంతో కూడుకున్న ఈ రామరక్షా స్తోత్రాన్ని పఠిస్తారో, వాళ్ళు దీర్ఘాయువు కలిగి, సుఖవంతుడు, పుత్రులను కలిగినవాడు, విజయ వినయశీలుడు అవుతాడు.

శ్రీరాముని దివ్యబలసంపన్నమైన ఈ రామరక్షా స్తోత్రము పఠించు పుణ్యాత్ముడు దీర్ఘాయువును, సుఖమును, పుత్రసంతానమును, విజయమును, వినయమును పొందగలడు.

11. పాతాళ భూతల వ్యోమ చారిణశ్-చద్మ చారిణః।
న ద్రష్టు మపి శక్తాస్తే రక్షితమ్ రామనామభిః॥

కపటులై, భూమ్యాకాశ పాతాళాలలో సంచరించువారు, ఎవరైనప్పటికీ రామ నామముచే రక్షింపబడిన వానిని కన్నెత్తైనా చూడజాలరు.

భూమి, ఆకాశము, పాతాళ లోకాలలో చరించే ఏ జీవి అయినా కూడా, రామనామం చేత రక్షించబడినవాడిని కన్నెత్తి అయినా చూడడం సాధ్యం కాదు.

పాతాళమునందు, భూమియందు, ఆకాశమునందు సంచరించే జీవులుగాని, అదృశ్యరూపమున విహరించే శక్తులుగాని రామనామముచే రక్షింపబడునట్టి వానిని కన్నెత్తికూడా చూడజాలవు.

12. రామేతి రామభద్రేతి రామచంద్రేతి వాస్మరన్।
నరో న లిప్యతే పాపై ర్భుక్తిం ముక్తిం చ విందతి॥

రామా! రామభద్రా! రామచంద్రా! అని నిరంతరము స్మరించు వానిని ఎట్టి పాపములు అంటవు. అతడు ఇహలోకములో సమస్త భోగములు అనుభవించి అంత్యమున మోక్షమును పొందగలడు.

రామా, రామభద్రా, రామచంద్రా అనే ఈ నామాలను స్మరించడం వలన మానవుడు పాపాలనుండి విముక్తి పొందడమే కాక సకల భోగాలను, అంత్యములో మోక్షాన్ని కూడా పొందుతాడు.

"రామ" అని కాని "రామభద్ర" అని కాని, "రామచంద్రా" అని కాని (నిరంతరము) స్మరించునట్టి మనుష్యునకు ఎట్టి పాపము అంటదు. అంతేగాక, అతడు భుక్తిని, ముక్తిని పొందగలడు.

13. జగజ్జై త్రైక మంత్రేణ రామనామ్నాభి రక్షితమ్।
యః కంఠే ధారయేత్తస్య కరస్థాః సర్వ సిద్ధయః॥

మూడు లోకాలను జయించు శక్తిగల రామ మంత్రముచే రక్షింపబడి ఉన్న ఈ రామ రక్షా స్తోత్రమును కంఠస్థము చేసిన వారికి సర్వ సిద్ధులు కరతలామలకములు అవుతాయి.

ఈ ప్రపంచాన్ని జయించడానికి ఒకే మంత్రమైన రామనామంతో కూడిన ఈ స్తోత్రాన్ని కంఠస్థం చేసిన వారు సకల సిద్ధులనూ పొందగలుగుతారు.

సకల జగత్తును జయింపగలిగిన ఏకైక మంత్రమగు రామనామముచే సురక్షితమైన ఈ (రామరక్షా) స్తోత్రమును కంఠమునందు ధరించినవానికి లేక కంఠస్థము చేసినవానికి సకల సిద్ధులు అతని అరచేతిలో నిలిచి యుండును.

14. వజ్రపంజర నామేదం యో రామకవచం స్మరేత్।
అవ్యాహతాజ్ఞః సర్వత్ర లభతే జయ మంగళమ్॥

వజ్ర పంజరమనే పేరుగల ఈ రామ కవచమును (శ్రీరామ వజ్రపంజరము) స్మరించిన వాని ఆజ్ఞలు తిరుగు లేనివై అన్ని చోట్లా అతనికి శుభము, విజయములు లభిస్తాయి.

వజ్రసదృశ్యమైన ఈ రామ రక్షా స్తోత్రాన్ని స్మరించే వారి ఆజ్ఞలను దాటటం ఎవరి వల్ల కాదు. అతడికి అన్ని విధాలా జయము, మంగళము కలుగుతాయి.

వజ్రపంజరము అను పేరుగల ఈ రామకవచమును పఠించే వాని ఆజ్ఞలకు ఎక్కడా ఎదురు ఉండబోదు. అంతటా అతనికి జయము, శుభము కలుగును.

15. ఆదిష్టవాన్ యథా స్వప్నే రామ రక్షా మిమాం హరః।
తథా లిఖితవాన్ ప్రాతః ప్రబుద్ధో బుధకౌశికః॥

పరమ శివుడు స్వప్నములో ఉపదేశించిన, ఈ రామ రక్షా స్తోత్రమును బుధకౌశిక ముని ప్రాతః కాలమున రచించెను.

రాత్రి నిదురించిన బుధకౌశిక ఋషికి స్వప్నంలో శ్రీ శంకర భగవానుడు ఆదేశించగా ఆయన ఉదయం మేలుకొని ఈ స్తోత్రాన్ని రచించారు.

(అగస్త్యముని శిష్యుడగు) బుధకౌశికుడు అను మునీశ్వరునకు శంకరుడు స్వప్నమునందు సాక్షాత్కరించి ఈ రామరక్షాస్తోత్రమును ఉపదేశించెను. ఉదయము మేల్కొనిన బుధకౌశికముని తనకు ఉపదేశింపబడిన ఈ స్తోత్రమును యథా తథముగా వ్రాసిపెట్టెను.

16. ఆరామః కల్పవృక్షాణాం విరామః సకలాపదామ్।
అభిరామ స్త్రిలోకానామ్ రామః శ్రీమాన్సనః ప్రభుః॥

కోరిన కోర్కెలు తీర్చు కల్ప వృక్షముల సమూహము వంటివాడు, సమస్త ఆపదలను రూపుమాపువాడు, మూడు లోకములకు అభిరాముడు, శ్రీమంతుడు అయిన శ్రీరామ చంద్రుడే మనకు ప్రభువు.

అనేక కల్ప వృక్షాలతో కూడిన వనం వంటివాడు, అన్ని ఆపత్తులను పోగొట్టేవాడు, మూడు లోకాలలో అతి సుందరుడు అయిన శ్రీ రామ చంద్రుడు నాకు భగవంతుడు.

రాముడు కల్పవృక్షముల ఆరామము (తోట) వంటివాడు, సకల ఆపదలను రూపుమాపెడువాడు, మూడు లోకములలోను అతిలోక సుందరుడు శ్రీరాముడే అట్టి శ్రీరాముడే మాకు ప్రభువు. (దేవుడు).

17. తరుణౌ రూపసంపన్నౌ సుకుమారౌ మహాబలౌ।
పుండరీక విశాలాక్షౌ చీరకృష్ణా జినాంబరౌ॥
18. ఫలమూలాసినౌ దాంతౌ తాపసౌ బ్రహ్మచారిణౌ।
పుత్రౌ దశరథస్యైతౌ భ్రాతరౌ రామలక్ష్మణౌ॥
19. శరణ్యౌ సర్వసత్త్వానాం శ్రేష్ఠౌ సర్వ ధనుష్మతామ్।
రక్షఃకుల నిహంతారౌ త్రాయేతాం నో రఘూత్తమౌ॥

మంచి వయో రూప సంపదలు గలవారు మహా బలశాలులు, సుకుమారులు, పద్మములవంటి విశాల నేత్రాలు గలవారు, నారబట్టలు, లేడి చర్మములే వస్త్రములుగా ధరించినవారు, కందమూల ఫలములను ఆహారముగా గ్రహిస్తూ, తాపసులై, బ్రహ్మచర్య దీక్షను పాటించువారు, దశరథ మహారాజు పుత్రులు, సమస్త ప్రాణులకు శరణ మిచ్చువారు, రాక్షసులను సమూలముగా నశింప చేయువారు, రఘువంశ శ్రేష్ఠులైన రామ లక్ష్మణులు మనలను రక్షింతురుగాక.

17,18,19. తరుణ వయస్సు కలవారు, రూపంలో అతి సుందరులు బలపరాక్రమలు, కమలములవంటి విశాలమైన నేత్రాలు కలవారు, నారచీరలను, కృష్ణమృగ చర్మాలను ధరించి, కంద మూల ఫలాలను ఆహారంగా స్వీకరించేవారు, మహా తపస్వులు, శరణు నిచ్చువారు, శ్రేష్ఠ ధనుర్ధారులు, రాక్షసులను నశింపచేయువారు అయినా రామలక్ష్మణులు మమ్ములను రక్షింతురుగాక.

17,18,19. యువకులు, అపురూప సుందరమూర్తులు, సుకుమారులు, మహాబలశాలురు, తెల్ల తామర రేకులవంటి విశాలమైన కన్నులు కలవారు, నార వస్త్రములు, కృష్ణాజినము (జింక చర్మము)ను ధరించినవారు, కందమూలములను ఆహారముగా తీసికొనువారు, తాపసవృత్తిలో ఉన్నవారు, ఇంద్రియ నిగ్రహము గలవారు, బ్రహ్మచారులు, దశరథ మహారాజు పుత్రులు, రఘుకుల శ్రేష్ఠులు అగు శ్రీరామ లక్ష్మణులు, సకల జీవరక్షకులు, ధనుర్ధారులలో కెల్ల శ్రేష్ఠులు, రాక్షస జాతిని నశింప చేయువారు, రఘుకుల శ్రేష్ఠులు అగు శ్రీరామ లక్ష్మణులు అను ఇరువురు సోదరులు మమ్ములను కాపాడుదురుగాక!

20. ఆత్తసజ్య ధనుషా విషుస్పృశా వక్షయాశుగ
నిషంగ సంగినౌ।
రక్షణాయ మమ రామలక్షణావగ్రతః
పథిసదైవ గచ్ఛతామ్॥

ధనస్సులు ఎక్కుపెట్టి మిక్కిలి వేగముగల బాణములు పట్టుకొను భుజాగ్రముల యందు అక్షయ తూణీరములతో నిండిన అమ్ముల పొదిని ధరించి రామ లక్ష్మణులు నన్ను రక్షించుటకు ఎల్లప్పుడూ నేను వెళ్లు మార్గములో నాకు ముందుగా నడుచు చుందురు గాక.

నారిని సారించిన ధనుస్సును చేతబట్టిన వారు, ఎల్లప్పుడూ బాణంపై తమ చేతులు కలవారు, అక్షయ బాణములు తూణీరంలో కలిగినవారు అయిన రామ లక్ష్మణులు ఎల్లప్పుడూ నా ముందుండి నన్ను రక్షించెదరుగాక.

నారి సంధించిన విల్లును ధరించి, ఎక్కుపెట్టిన బాణమును స్పృశించినట్టి, తరుగని బాణములు కలిగిన తూణీరము (అమ్ములపొది) దాల్చినట్టి రామ లక్ష్మణులు నన్ను కాపాడుటకై నేను ఎల్లప్పుడు నడుచు మార్గమునందు నాకంటే ముందు ముందుగా నడచెదరుగాక.

21. సన్నద్ధః కవచీ ఖడ్గీ చాపబాణధరో యువా।
గచ్ఛన్ మనోరథాన్నశ్చ(మనోరథోஉస్మాకం)
రామః పాతు స లక్ష్మణః॥

జగద్రక్షణార్థము సర్వదా సంసిద్ధుడై కవచ, ఖడ్గములు, విల్లంబులు ధరించి యువకుడై, తమ్ముడైన లక్ష్మణునితో కూడిన శ్రీరాముడు మన కోరికలను తీరుస్తూ మనలను రక్షించుగాక.

కవచాలు ధరించి, ఖడ్గాన్ని చేబూని, సర్వ కాల సర్వ అవస్థలలో సన్నద్ధులై వుండే రామ లక్ష్మణులు మన ముందు నడుస్తూ మనలను రక్షింతురుగాక.

కవచము, ఖడ్గము, విల్లమ్ములను ధరించి, సర్వదా సంసిద్ధులై యుండి యౌవనదశతో విలసిల్లెడు శ్రీరాముడు లక్ష్మణసమేతుడై ముందుకు సాగుచు మా కోరికలను తీర్చునుగాక, మమ్ము కాపాడుగాక!

22. రామో దాశరథి శ్శూరో లక్ష్మణానుచరో బలీ।
కాకుత్స్థః పురుషః పూర్ణః కౌసల్యేయో రఘూత్తమః॥

23. వేదాంత వేద్యో యజ్ఞేశః పురాణ పురుషోత్తమః।
జానకీవల్లభః శ్రీమాన్ అప్రమేయ పరాక్రమః॥

24. ఇత్యేతాని జపేన్నిత్యం మద్భక్తః శ్రద్ధయాన్వితః।
అశ్వమేథాధికం పుణ్యం సంప్రాప్నోతి న సంశయః॥

22,23,24. స్వయంగా శ్రీరామచంద్ర ప్రభువు ఈ క్రింది నామాలను జపించు భక్తులకు కలుగు పుణ్యమును చెప్పుచున్నాడు. (రాముడు, దశరథ పుత్రుడు, శూరుడు, లక్ష్మణుడు అనుచరుడుగా గలవాడు, బలవంతుడు, కాకుత్థ్సుని వంశములో పుట్టినవాడు, పురుషోత్తముడు, పరిపూర్ణుడు, కౌసల్యాసుతుడు, రఘువంశ శ్రేష్ఠుడు, వేదాంతము ద్వారా తెలియబడువాడు, యజ్ఞములకు అధిపతి, పురాణపురుషులలో ఉత్తముడు, సీతాపతి, శ్రీమంతుడు, అపరిమిత పరాక్రమము గలవాడు అను అర్ధముల నిచ్చే) “రామ, దాశరథిః, శూరః లక్ష్మణానుచరః, బలీ, కాకుత్థ్సః, పురుషః, పూర్ణః, కౌసల్యేయః, రఘూత్తమః, వేదాంతవేద్య, యజ్ఞేశః , పురాణ పురుషోత్తమః, జానకీ వల్లభః, శ్రీమాన్ అప్రమేయ పరాక్రమః,” అను నామములను నిత్యం జపించువాడు అశ్వమేథ యాగాన్ని చేసినందువల్ల లభించు పుణ్యం కన్న ఎక్కువ పుణ్యాన్ని పొందుతాడు అనుటలో ఎట్టి సందేహము లేదు.

22,23,24. రామా, దాశరథీ, సూరా, లక్ష్మణ అనుచర, బలి, కాకుత్స, పరమ పురుషా, పూర్ణ, కౌసల్యేయ, రఘోత్తమ, వేదాన్తవేద్యా, యజ్ఞేశ, పురాణపురుషోత్తమ, జానకీ వల్లభా, శ్రీమాన్, అప్రమేయ పరాక్రమ అనే ఈ నామాలను ప్రతి నిత్యం భక్తి ప్రపత్తులతో పఠించే వారు అశ్వమేధ యాగాన్ని చేసినదానికన్నా అధిక ఫలితం పొందుతారు.

22,23,24. (భగవంతుడు ఇట్లు పలికెను) – రాముడు, దాశరథి, శూరుడు, లక్ష్మణానుచరుడు, బలవంతుడు, కాకుత్థ్సుడు, పురుషుడు, పూర్ణుడు, కౌసల్యాతనయుడు, రఘూత్తముడు, వేదాంతవేద్యుడు, యజ్ఞేశుడు, పురాణ పురుషోత్తముడు, జానకీ వల్లభుడు, శ్రీమంతుడు, అప్రమేయ పరాక్రముడు – అను ఇటువంటి (నా) పదహారు నామములను శ్రద్ధా భక్తులతో నిత్యము జపించే నా భక్తుడు నిస్సంశయముగా అశ్వమేధ యాగము కన్న అధికమైన పుణ్యఫలమును పొందగలడు.

25. రామం దూర్వాదళ శ్యామం పద్మాక్షం పీతవాససమ్।
స్తువంతి నాభిర్-దివ్యైర్-నతే సంసారిణో నరాః॥

దూర్వాదళ శ్యాముడు, కమల నేత్రుడు, పీతాంబరాన్ని ధరించిన వాడు అయిన శ్రీరామ చంద్రుని దివ్యములైన నామాలతో స్తుతించు మానవులు, సంసార బంధనాలను త్యజించి మోక్షమును పొందగలరు.

దూర్వాదళం వంటి నీల వర్ణం కలిగినవాడు, కమల నేత్రుడు, పీతాంబరాలు ధరించినవాడు అయిన శ్రీరామచంద్రుని నామాలను జపించే వారు సంసార సాగరములనుండి ఉద్ధరించబడతారు.

దూర్వాదళములవలె నల్లని మేను, తామర రేకుల వంటి కన్నులు గలిగి పీతాంబరమును ధరించినట్టి శ్రీరామ చంద్రుని దివ్య నామములతో స్తోత్రము చేయు నరులు సంసార బంధమున తగులుకొనరు.

26. రామం లక్ష్మణ పూర్వజం రఘువరం సీతాపతిం
సుందరం।
కాకుత్స్థం కరుణార్ణవం గుణనిధిం
విప్రప్రియం ధార్మికమ్॥

రాజేంద్రం సత్యసంధం దశరథతనయం శ్యామలమ్
శాంతమూర్తిమ్।
వందేలోకాభిరామం రఘుకుల తిలకం రాఘవమ్
రావణారిమ్॥

లక్ష్మణాగ్రజుడు, రఘువంశ శ్రేష్ఠుడు, సీతాపతి, సుందరుడు, కాకుత్థ్స వంశజుడు, దయాసముద్రుడు, సద్గుణాలకు నిధి, బ్రాహ్మణ ప్రియుడు, ధర్మ మందు శ్రద్ధ గలవాడు, (రామో విగ్రహవాన్ ధర్మః) చక్రవర్తి, సత్యవాక్పాలనా దీక్షాపరుడు, రఘువంశ శ్రేష్ఠుడు, నీలవర్ణము కలవాడు, శాంతమూర్తి దశరథ తనయుడు, రావణుని సంహరించినవాడు, లోకాభిరాముడు అయిన శ్రీరామునికి నమస్కారము. (కాకుత్థ్స వంశము, ఇక్ష్వాకు వంశము, రఘువంశము - సూర్య వంశమునకు పర్యాయములు (వంశానుక్రమము)

లక్ష్మణునికి అగ్రజుడు, రఘుకుల శ్రేష్ఠుడు, సీతామనోహరుడు, కాకుత్స కులనందనుడు, కరుణామూర్తి, గుణనిధి, బ్రాహ్మణ ప్రియుడు రాజులకు రాజు, సత్యప్రతిజ్ఞ కలవాడు, దశరథసుతుడు శ్యామవర్ణుడు, అతిలోక సుందరుడు, రఘుకుల తిలకుడు, రాఘవుడు, రావణుని సంహరించినవాడు అయిన శ్రీ రామ చంద్రునకు నేను నమస్కరిస్తున్నాను.

లక్ష్మణమూర్తికి అన్న, రఘువంశ శ్రేష్ఠుడు, సీతాపతి సుందర స్వరూపుడు, కాకుత్థ్స వంశజుడు, దయాసముద్రుడు, గుణనిధి, బ్రాహ్మణప్రియుడు, ధర్మ స్వరూపుడు, రాజులకు రాజు, సత్యనిష్ఠుడు, దశరథుని పుత్రుడు, శ్యామల శరీరుడు (నల్లనివాడు), శాంత స్వరూపుడు, సకలలోక సుందరుడు, రఘుకుల నందనుడు రాఘవుడు, రావణాసురనకు శత్రువగు శ్రీరామునకు నమస్కరించెదను.

27. రామాయ రామభద్రాయ రామచంద్రాయ వేధసే।
రఘునాథాయ నాథాయ సీతాయాః పతయే నమః॥

రాముడు, రామభద్రుడు, రామచంద్రుడు, రఘునాథుడు, సీతాపతి అని పిలువ బడుచున్న శ్రీరామ చంద్రునకు నమస్కారము.

రామా, రామభద్రా, రామచంద్రా, రఘునాథ, ప్రభూ, సీతామనోహరా నీకు నమస్కారము.

రామునికి, రామభద్రునికి, రామచంద్రునికి, పరబ్రహ్మ స్వరూపునికి, రఘునాథునికి, సీతానాథునికి (నా) స్వామికి వందనము.

28. శ్రీరామ రామ రఘునందన రామ రామ।
శ్రీరామ రామ భరతాగ్రజ రామ రామ।
శ్రీరామ రామ రణకర్కశ రామ రామ।
శ్రీరామ రామ శరణం భవ రామ రామ॥

రఘునందనా! భరతాగ్రజా! రణకర్కశా! రామా! శ్రీరామా! నిన్నే శరణు వేడుచున్నాను. నన్ను రక్షింపుము.

రఘునందనా, భరతునికి అగ్రజుడా, యుద్ధములో అతి కర్కశుడైన వాడా, మాకు శరణు నొసంగి మమ్ములను రక్షించుము.

శ్రీరామా! రఘునందనుడవగు రామా!! శ్రీరామా! భరతాగ్రజుడ వగు రామా!! శ్రీరామా! రణరంగ ధీరుడవగు రామా!! శ్రీరామా! మాకు నీవు రక్షకుడవై మమ్ము పాలింపవయ్యా! రామా! శ్రీరామా!!

29. శ్రీ రామచంద్ర చరణౌ మనసా స్మరామి।
శ్రీరామచంద్ర చరణౌ వచసా గృణామి॥
శ్రీ రామచంద్ర చరణౌ శిరసా నమామి।
శ్రీరామ చంద్ర చరణౌ శరణం ప్రపద్యే॥

శ్రీరామచంద్రుని పాద పద్మాలను మనసారా స్మరించు చున్నాను. శ్రీరామ చంద్రుని చరణ కమలములను నోరార కీర్తించు చున్నాను. శ్రీరామచంద్రుని అంఘ్రియుగళికి తలవంచి నమస్కరించు చున్నాను. శ్రీ రామచంద్రస్వామీ! నేను నీ పాదములను వేడుకొనుచున్నాను.

శ్రీరామచంద్రుని పాదాలను మనసులో నిరంతరం స్మరిస్తున్నాను. రామచంద్రుని పాదాలనే భజిస్తున్నాను. రామచంద్రుని చరణాలకు శిరస్సు వంచి అభివాదం చేస్తున్నాను. శ్రీ రామచంద్రుని పాదాలు నాకు శరణు నొసంగుగాక.

శ్రీరామాచంద్రుని చరణములను మనసారా స్మరించెదను. శ్రీరామచంద్రుని పాదములను వాక్కుచే కీర్తించెదను. శ్రీరామాచంద్రుని చరణసరోజములకు శిరస్సువంచి నమస్కరించెదను. శ్రీరామచంద్రుని పాదపద్మములనే శరణువేడెదను.

30. మాతారామో మత్-పితా రామచంద్రః।
స్వామీ రామో మత్-సఖా రామచంద్రః॥
సర్వస్వం మే రామచంద్రో దయాళుః
నాన్యం జానే నైవ జానే న జానే॥

నాకు తల్లి, తండ్రి, యజమాని,స్నేహితుడు, సమస్తమూ దయాసముద్రుడైన శ్రీరాముడే. మరే అన్య దేవతలను నేను ఎరుగను.

శ్రీ రామచంద్రా, నాకు తల్లివి, తండ్రివి, ప్రభువువు, స్నేహితుడవు, నా సర్వస్వము నీవే. నీవు తప్ప నేను ఇతరులను ఎవరిని ఎరుగను.

రాముడే నాకు తల్లి. రామచంద్రుడే నాకు తండ్రి. శ్రీరాముడే నాకు ప్రభువు. స్వామి, రామచంద్రుడే నా మిత్రుడు. దయామయుడగు రాముడే నా సర్వస్వము. శ్రీరాముడు దక్క వేరెవ్వరినీ నేను ఎఱుగనే ఎఱుగను.

31. దక్షిణే లక్ష్మణో యస్య వామే చ జనకాత్మజా।
పురతో మారుతిర్-యస్య తం వందే రఘువ(న)ందనమ్॥

కుడివైపున లక్ష్మణుడు, ఎడమ వైపు సీతాదేవి, ఎదుట ఆంజనేయుడు ఉండగా, విరాజిల్లుతున్న రఘునందనుడైన శ్రీరామునికి వందనం.

దక్షిణ భాగంలో లక్ష్మణమూర్తి, వామ భాగంలో సీతాదేవి, నీ సముఖంలో అంజనేయుడు విరాజ మానులై వుండి చూపెట్టే రఘునాధునికి నేను భక్తితో ప్రణమిల్లుచున్నాను.

కుడిప్రక్కన లక్ష్మణుడు కొలువుదీరి యుండగా, ఎడమప్రక్కన సీతాదేవి అలరారుచుండగా, ఎదుట హనుమంతుడు సేవించుచుండగా, మధ్యన వెలుగుచుండెడు రఘునందనునికి నమస్కరించెదను.

32. లోకాభిరామం రణరంగధీరమ్।
రాజీవనేత్రం రఘువంశనాథమ్॥
కారుణ్యరూపం కరుణాకరం తమ్।
శ్రీరామచంద్రం శరణ్యం ప్రపద్యే॥

మనోహరమైన రూపము గలవాడు, యుద్ధ రంగమున తిరుగు లేనివాడు, సరసిజాక్షుడు, రఘువంశ శ్రేష్ఠుడు, కారుణ్యమే రూపము దాల్చినట్లు ఉన్నవాడు, దయకు నెలవైనవాడు అయిన శ్రీరామ చంద్రుని శరణు వేడుచున్నాను.

సర్వ లోకాలకు సంతోషాన్ని కలిగించేవాడు, రణం అనే క్రీడలో ధీరత్వం కలిగినవాడు, కమలములవంటి కన్నులు కలవాడు, రఘువంశ నాయకుడు, కరుణ రసం మూర్తీభవించినవాడు, అయిన శ్రీరామచంద్రుడు నాకు శరణు నిచ్చుగాక.

లోకోత్తర సుందరాకారుడు, రణరంగధీరుడు, కమలనయనుడు, రఘువంశ నాయకుడు, దయాస్వరూపుడు, కరుణామూర్తి అగు శ్రీరామచంద్రుని శరణు వేడుకొందును.

33. మనోజవం మారుత తుల్య వేగమ్।
జితేంద్రియం బుద్ధిమతాం వరిష్ఠమ్॥
వాతాత్మజం వానరయూథ ముఖ్యమ్।
శ్రీరామదూతం (శిరసా నమామి) శరణం ప్రపద్యే॥

మనో వేగము గలవాడు, వాయుసమాన వేగం గలవాడు, ఇంద్రియములను జయించినవాడు, బుద్ధి మంతులలో శ్రేష్ఠుడు, వాయుపుత్రుడు, వానర వీరులలో ముఖ్యుడు, శ్రీరాముని దూత అయిన హనుమానుని శరణు వేడు చున్నాను.

మనసుతో సమానంగా వాయువేగంతో పయినించగలిగి, ఇంద్రియములను జయించినవాడై, శ్రేష్ఠుడైన వాయునందనుడు, వానరులలో శ్రేష్ఠుడు అయిన శ్రీరామ దూత నాకు శరణు ప్రసాదించుగాక.

మనోబలమును, వాయు వేగమును కలిగినవాడు, ఇంద్రియములను జయించినవాడు, బుద్ధిమంతులలో అగ్రగణ్యుడు, వాయుపుత్రుడు, వానర సమూహమునకు నాయకుడు, శ్రీరామ బంటు అగు శ్రీ ఆంజనేయస్వామిని శరణువేడెదను.

34. కూజంతం రామరామేతి మధురం మధురాక్షరమ్।
ఆరుహ్య కవితా శాఖాం వందే వాల్మీకి కోకిలమ్॥

సంస్కృత కవితాశాఖపై ఆరోపించి శ్రీరామా! రామా! అంటూ మధురముగా కూయుచున్న వాల్మీకి అనే కవి కోకిలకు నమస్కారము. (వాల్మీకి పలుకులు మధురము, ఆయన కావ్యము కోకిల కూజితము వలె మరింత మధురము)

కవిత్వమనెడు చెట్టుకొమ్మపై కూర్చుండి, 'రామా! రామా' అనెడు తీయని అక్షరములను మరింత తీయతీయగా కూసెడు వాల్మీకియను కోకిలకు నమస్కరించెదను.

35. ఆపదామపహర్తారం దాతారం సర్వసంపదాం।
లోకాభిరామం శ్రీరామం భూయో భూయో
నమామ్యహమ్॥

ఆపదలను పోగొట్టి, సమస్త సంపదలను ప్రసాదించు లోకాభిరాముడైన శ్రీరామునకు మరల మరల నేను నమస్కరింతును.

34,35. వాల్మీకి మహామునిచే మధురాక్షరములో స్తుతించబడినవాడు, ఆపదలను తొలగించువాడు, సర్వ సంపత్కారకుడు, లోకాభిరాముడు, అయిన శ్రీరామ చంద్రునకు నేను మరల మరల నమస్కరిస్తున్నాను.

ఆపదలను తొలగించువాడు, సకలవిధములగు సంపదలను ప్రసాదించు వాడు, లోకములను మోహింపజేయు సౌందర్యము గలవాడగు శ్రీరామునికి మాటి మాటికి నమస్కరింతును.

36. భర్జనం భవబీజానా మర్జనం సుఖసంపదామ్।
తర్జనం యమదూతానాం రామ రామేతి గర్జనమ్॥

రామనామ జపం వలన సంసార కారణాలు నశించి పోతాయి. సుఖ సంపదలు చేకూరుతాయి. రామ నామ మంత్ర ప్రభావంచేత యమభటులు సైతం భయపడతారు.

రామనామ జపం అన్ని సంసార బంధనాలను తొలగించి, సమస్త సుఖ సంపత్తులను ప్రసాదించి, యమదూతలను కూడా భయపెట్టగల శక్తివంతమైనది.

"రామా! రామా!" అను గర్జనము మానవుని జన్మలకు కారణమగు బీజములను నశింపజేయును. సకల సుఖములను, సంపదలను పెంపొంద జేయును. యమదూతలను దగ్గరకు రాకుండా బెదరగొట్టును.

37. రామో రాజమణిః సదా విజయతే రామం
రమేశం భజే।
రామేణాభిహతా నిశాచర చమూ రామాయ
తస్మై నమః॥
రామాన్నాస్తి పరాయణం పరతరం రామస్య
దాసోస్మ్యహమ్।
రామే చిత్తలయః స(స్స)దా భవతు మే భో రామ
మాముద్ధర॥

రాజశ్రేష్ఠుడైన రాముడు సర్వదా విజయుడై ఉన్నాడు. అటువంటి లక్ష్మీయుతుడైన శ్రీరాముని నేను భజించు చున్నాను. (రాముని చేత రాత్రించరులైన రాక్షస సమూహం హతమైనది. అట్టి శ్రీరాముని కొరకు నమస్కారము) రాముని కంటె శరణు పొందదగిన అండ మరొకటి లేదు. అట్టి రాముని యొక్క దాసుడను నేను. రాముని యందు నా చిత్తము సర్వదా లీనమై యుండుగాక. ఏ రామా! నన్ను ఉద్ధరింపుము.

(ఏడు) (7+1) విభక్తులను ఉపయోగించి శ్లోకమును లేదా పద్యమును వ్రాయుట పూర్వ సంప్రదాయము. ఈ విధముగా రచించిన సార్వ విభక్తితక శ్లోకమిది.)

రాజులలో శ్రేష్ఠుడైన శ్రీ రామచంద్రునకు ఎప్పటికీ విజయమే. సీతాపతి అయిన రామచంద్రుని నేను భజిస్తాను. రాక్షస సంహారకుడైన శ్రీరామచంద్రునకు నేను నమస్కరిస్తున్నాను. రాముని కన్నా అన్య దైవం నాస్తి. నేను శ్రీరామ చంద్రునకు

దాసానుదాసుడను. నా మనసు ఎప్పుడు రామునిలోనే లగ్నమై ఉండుగాక. రామా నన్ను ఉద్ధరించుము తండ్రీ.

రాజులు అందరిలో తలమానికమగు "రామునకు సర్వదా జయము! జయము! రాముని, రమాపతిని నేను భజింతును". "రామునిచేత రాక్షస సైన్యము హతమార్చబడినది." అట్టి రామునకు నమస్కారము.

38. శ్రీరామ రామ రామేతి రమే రామే మనోరమే।
సహస్రనామ తత్తుల్యం రామ నామ వరాననే॥

శ్రీ రామచంద్రుని "రామ రామ" అంటూ నేను (శివుడు) మనసులోనే ప్రార్థిస్తున్నాను. ఒక్క రామనామమే సహస్రనామాలకు సమానమైనది. (రామ నామము, విష్ణు సహస్రనామాలతో సమానమైనదని శివుడు పార్వతికి తెలియ జేసిన సందర్భము లోనిది)

శ్రీ శంకర ఉవాచ: పార్వతీ, రామనామం విష్ణు సహస్రనామంతో సమానమైనది. నేను ఎప్పుడు రామ, రామ అనే మనోహరమైన రామ నామంలోనే నిమగ్నమై ఉంటాను.

// ఇతి శ్రీ బుధకౌశిక ముని విరచితం శ్రీరామ రక్షాస్తోత్రం సంపూర్ణం. //

- - - = - - -

రామాయ రామ భద్రాయ రామచంద్రాయ వేదసే।
రఘునాథాయ నాథాయ సీతాయాః పతయే నమః॥

- - - = - - -

శ్రీ రామ రామ రామేతి రమే రామే మనోరమే।
సహస్రనామ తత్తుల్యం రామనామ వరాననే॥

- - - = - - -

కిరణ్ టైప్ ఇన్‌స్టిట్యూట్





(ఎక్కడైనా తప్పులు ఉంటే సహృదయంతో తెలియజేయవలసినదిగా మనవి.-944 044 9650, 994 994 1430)

Kiron Type Institute